క్లుప్తంగా

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మహమ్మదాబాద్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో 22మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన కమిషనర్

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలోని కేజీబీవీని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సందర్శించారు. విద్యాలయంలో ఆయన స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. వంటగదులు, వంటసామగ్రి, శానిటేషన్ గురించి విచారించారు. విద్యార్థినులతో భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. ఫ్యాన్లు, లైట్లు కావాలని విద్యార్థినులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చారు.

కోయంబత్తూరుకు ఫోర్టిఫైడ్ బియ్యం

జడ్చర్ల టౌన్: భారీవర్షాలను అధిగమిస్తూ మండలంలోని చర్లపల్లి ఎఫ్‌సీఐ గోదాం నుంచి తమిళనాడులోని కోయంబత్తూరు ఎఫ్‌సీఐ ఫుడ్‌స్టోరేజీకి ఫోర్టిఫైడ్ బియ్యం శుక్రవారం రాత్రి తరలించినట్లు మేనేజర్ రాఘవేందర్, వేర్‌హౌజ్ మేనేజర్ శ్రీనివాసచారి తెలిపారు. వర్షాలు వస్తున్నప్పటికీ గోదాం నుంచి ట్రక్కుల ద్వారా రైల్వేస్టేషన్‌లోని లోడింగ్ పాయింట్‌కు చేర్చి 42భోగీల ద్వారా కోయంబత్తూరుకు ఫోర్టిఫైడ్ రైస్ పంపించినట్లు వెల్లడించారు.

'ప్రభుత్వ విద్యను కాపాడటంలో విఫలం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ విద్యను కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు కురుమూర్తి ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జీపుయాత్ర నిర్వహించారు. ముగింపు సభను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి త్వరలో కలెక్టరేట్ ముట్టడించనున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, శ్రీనాథ్, నందు, నాయకులు జ్ఞాపికసాయి, నవ్య, బన్నీ, మణికంఠ పాల్గొన్నారు.

సీసీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీకేరెడ్డి కాలనీలోని శివాలయం నుంచి పెద్దచెరువు కట్ట వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డును శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఈ పనులను నాణ్యతగా చేపట్టాలని, ముఖ్యంగా వాహనదారులు, కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణం నీటి మూటలేనా!



భూత్పూర్: కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మిస్తామని ఏడాది క్రితం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్, ఆర్డీవో పోతుమడుగు–గోపన్నపల్లి మధ్య ఉన్న కాజ్‌వేపై రూ.3.5 కోట్లు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని చెప్పి నేటికి నీటి మూటలుగానే మిగిలిందని మత్స్య సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం భూత్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది వర్షాకాలంలో మండలంలోని పోతులమడుగు నుంచి గోపన్నపల్లికి వెళ్లే దారిలో భారీ వర్షాలకు వారం రోజుల పాటు రాకపోకలు నిలిచిపోగా ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్డీవో, స్థానిక మండలాధికారులు, కాంగ్రెస్ నాయకులు వచ్చి పరిశీలించి నిధులు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని మాట ఇచ్చి, నేటికీ పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. నాలుగు నెలల క్రితం మండల నిధుల నుంచి రూ.90వేలు కాజ్‌వేపై మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసి ఖర్చు చేశారని, పనులు నాసిరకంగా చేపట్టారని విమర్శించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని కోరారు.

వరములివ్వమ్మా.. వరలక్ష్మీ



ద్వారకామాయి మందిరంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు
- ఆలయాల్లో కుంకుమార్చన, అభిషేకాలు, పల్లకీసేవ
- ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులతో వాయినాలు

సాక్షి, నెట్‌వర్క్: దేవరకద్ర మున్సిపాలిటీలో శుక్రవారం వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పలువురు మహిళలు తమ ఇళ్లల్లో వరలక్ష్మీ మాతను ప్రతిష్ఠించి వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా ముత్తయిదువులను ప్రత్యేకంగా పూజలకు ఆహ్వానించి పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, స్వీట్లతో వాయినాలను అందజేశారు. అలాగే దేవరకద్రలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. పలువురు మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వరలక్ష్మీ మాతకు పూజలు చేశారు. అర్చకులు వారితో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేయించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, పల్లకీసేవ నిర్వహించారు.



బ్రాహ్మణవాడి శ్రీవాసవీమాత ఆలయంలో..

■ అడ్డాకుల మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో పండితుడు మఠం రాజేశ్వరస్వామి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం చేశారు. కుంకుమార్చన చేసి అమ్మవారి కథను విని మొక్కులు నెరవేరాలని ఆకాంక్షించారు.

■ నవాబుపేట మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిరం, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సాముహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు చేశారు. మహిళలు ఇళ్లల్లో ప్రత్యేకంగా అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేసుకుని పూజలు చేసి వాయినాలు అందించారు.

■ రాజాపూర్ మండల కేంద్రంతోపాటు తిర్మలాపూర్, మల్లేపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. రాజాపూర్‌లోని శివసీతారామాంజనేయస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

■ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, గండేడ్, పగిడ్యాల్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, సల్కర్‌పేట్‌లో వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. వెన్నాచేడ్‌లో సత్యసాయి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించగా.. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నారాయణరెడ్డి, సభ్యులు రాములు గౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్ల టౌన్‌లోని సరస్వతి శిశుమందిరం, వాసవీ కన్యకాపరమేశ్వరి, సకలదేవతలు, రేణుకాఎల్లమ్మ, సంతోషిమాత ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించి వాయనాలు పుచ్చుకున్నారు.



జిల్లాకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో..



అడ్డాకుల శివాంజనేయస్వామి ఆలయంలో..



జడ్చర్ల టౌన్‌లోని సరస్వతి శిశుమందిరంలో..

అథ్లెటిక్స్‌లో రజతం



చిన్నచింతకుంట: మండలంలోని అల్లిపూరం గ్రామానికి చెందిన క్రీడాకారిణి సుచిత్ర అథ్లెటిక్స్‌లో పాల్గొని రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. జనగాం జిల్లాలోని ధర్మకాంచ మినీ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ పోటీలో పాల్గొని స్టాండింగ్ బ్రాడ్‌జంపులో రెండోస్థానంలో నిలిచింది. అందుకు శుక్రవారం రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి చేతుల మీదుగా మెడల్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంది. దీంతో సుచిత్రను గ్రామస్తులు పలువురు అభినందించారు.

తల్లిపాలు బిడ్డకు వరం



నవాబుపేట: తల్లి పాలు బిడ్డలకు వరంలాంటివని ఎంపీడీఓ జయరాంనాయక్, ఐసీడీఎస్ అధికారి రాజారాజేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బిడ్డకు తల్లిపాలు దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరకుండా రక్షణగా నిలుస్తాయని సూచించారు. అలాగే ప్రతి ఇంట్లో సహజంగా అందుబాటులో ఉండే ఆకుకూరలు, పండ్లతో లభించే పౌష్టిక పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీజ, హెల్త్ సూపర్‌వైజర్ శివలీల, ఆర్ఐ రామాంజనేయులు, శ్రీనివాస్, రాములు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్, కాజ్‌వే పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వరదతోపాటు మురుగు సాఫీగా ముందుకు వెళ్లేందుకు శ్రీనివాస కాలనీలోని రూరల్ పీఎస్ వెనుక భాగంలో నిర్మిస్తున్న డ్రెయిన్, కాజ్‌వే పనులను శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ సందీప్‌వరల్డ్, ఏఈ వసంత, మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు ఉచితంగా ఇవ్వాలి

పాత పాలమూరులోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో వివిధ శుభకార్యాలు నిర్వహించుకునేందుకు పేదలకు ఉచితంగా ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భరత్‌కుమార్, రవి, మల్లేశ్, నరేశ్, రత్నకుమార్, ముక్రంషా, షకీల్, సరోజ, అనిత, వాణి, గీత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల (సి) వసతి గృహాన్ని శుక్రవారం ప్రత్యేకాధికారి, డీఎస్‌ఓ గంపా శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలతోపాటు వంట గదిలోని వివిధ సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వసతి గృహ సంక్షేమాధికారిణి స్వప్నప్రియ, విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం వంటలు వండి బాలికలకు వడ్డించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వసతి గృహ సంక్షేమాధికారిణి స్వప్నప్రియ

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం తిర్మలాపురంలో గ్రామదేవత పోచమ్మ నూతన ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులతో అమ్మవారి ఆలయం ఎదుట హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి పూజలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయం శిఖరంపై కళశాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు విజయసారథిరెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. వివిధ గ్రామాలనుంచి ఆడపడుచులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నది.

ఆలూరువాసుల కష్టాలు తీరేదెప్పుడు

- ఆర్‌యూబీ వద్ద భారీగా నిలిచిన వరద నీరు
- రోడ్‌డ్యాం వద్ద ఉధృతంగా అలుగునీటి ప్రవాహం



ఆలూరు మార్గంలో ఆర్‌యూబీ కింద నిలిచిన వరదనీరు

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆలూరుకు గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వేలైన్ కింద ఉన్న ఆర్‌యూబీలో వరదనీరు ప్రమాదస్థాయిలో నిల్వడంతో గురువారం రాత్రి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయానికి నీటిమట్టం కొద్దిగా తగ్గడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆలూరు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెరువు నిండి అలుగు పారుతుండటం , వరదనీరు తోడుకావడంతో రోడ్‌డ్యాం వద్ద మూడు అడుగుల మేర నీటిప్రవాహం కొనసాగింది. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత కొంత ఉధృతి తగ్గడంతో బైకులు, ఆటోల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రెండుచోట్ల వరదనీరు కారణంగా ఆలూరు నుంచి నియోజకవర్గ కేంద్రానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు బూర్గుపల్లి మీదుగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. భారీ వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే సమస్య ఎదుర్కుంటున్నామని, చెరువు వద్ద రోడ్ డ్యాంపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదేవిధంగా ఆర్‌యూబీలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలేపల్లి–కారూరుకు నిలిచిన రాకపోకలు

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి నుంచి నవాబుపేట మండలం కారూరుకు భారీవర్షాల కారణంగా వర్షపునీరు నిలిచి రాకపోకలు స్థంభించాయి. రోడ్డుపై మధ్యలో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. నాటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి 2022 ఏడాదిలో రూ.33లక్షలు విడుదల చేయించారు. టెండరు పొందిన కాంట్రాక్టరు అలసత్వం కారణంగా బ్రిడ్జ్ నిర్మాణం కేవలం పిల్లర్లకే పరిమితమైంది. దీంతో భారీ వర్షం వచ్చిన ప్రతిసారి పోలేపల్లి నుంచి కారూరుకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జ్ నిర్మాణం చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పోలేపల్లి, కారూరువాసులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని కోరుతున్నారు.

నేలకూలిన వృక్షం తొలగింపు



డబ్బాపై కూలిన భారీచెట్టు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం రోడ్డులో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భారీ వృక్షం నేలవాలడంతో శుక్రవారం తొలగించారు. భారీ వృక్షం కూలిన ఘటనలో పెనుప్రమాదం తప్పినట్లయింది. బాలరాజు అనే స్టాంప్ వెండర్‌కు సంబంధించిన డబ్బాపై చెట్టు విరిగిపడింది. అదేవిధంగా ఎదురుగా ఉన్న హోటల్‌పై చెట్టు పడడంతో ఆ సమయంలో పెద్దగా జనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే ఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. శుక్రవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది చెట్లను తొలగించగా విద్యుత్ అధికారులు, సిబ్బంది సాయంత్రం వరకు దానిని మరమ్మతు చేసి విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. వార్డుకౌన్సిలర్ రఘురాంగౌడ్ పనులను పర్యవేక్షించారు.

అనుబంధాల 'రక్ష'



భూత్పూర్ సాహితీ ఉన్నత పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థినులు



జడ్చర్ల టౌన్: రాఖీలు కడుతున్న బాలికలు

భూత్పూర్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్, విద్యార్థుల్లో అన్నాచెల్లెలు అనే భావం కలగాలని ప్రతిఏటా పాఠశాలల్లో రక్షాబంధన్ నిర్వహిస్తున్నట్లు సాహితి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం భూత్పూర్ పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు అన్నాచెల్లెల ఔనత్యం, ఇంట్లో అన్నాచెల్లెళ్ల మాదిరిగా బయటి ప్రపంచంలో ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థినులు పలువురి విద్యార్థులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

■ జడ్చర్ల టౌన్ 23వ వార్డులోని సత్యం విద్యాలయంలో శుక్రవారం చిన్నారి బాలికలతో బాలురకు రాఖీ కట్టించి ఒకరికొకరు రక్ష అంటూ వారితో నినదింపజేశారు.

పోరాటాల యోధుడి చరిత్ర ఆదర్శం



జడ్చర్లలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, ముదిరాజ్‌లు

నవాబుపేట/అడ్డాకుల/జడ్చర్లటౌన్/గండేడ్: తెలంగాణ రాబిన్‌హుడ్ పండగ సాయన్న చరిత్ర ఆదర్శమని కొల్లూరు గ్రామస్తులు పేర్కొన్నారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా శుక్రవారం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చందర్, రాజు, యాదయ్య, రఘు, ఖాజా, రామకృష్ణ, వెంకటయ్య, కృష్ణయ్య, బాలకిష్టయ్య, నరేశ్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్, పూలే చౌరస్తాలో పండుగ సాయన్న చిత్రపటం ఏర్పాటు చేసి మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, ముదిరాజ్ సంఘ నాయకులు నివాళులర్పించారు. అంతకుముందు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేటకు చెందిన జొన్నలగడ్డ వెంకటరమణ వేసిన పండుగ సాయన్న వేషాధారణ ముదిరాజ్‌లు, పట్టణవాసులను ఆకట్టుకుంది. కొద్దిసేపు ఏకపాత్రాభినయం ప్రదర్శించారు.

■ గండేడ్‌లో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో ప్రధానచౌరస్తాలో పండుగ సాయన్న జయంతి నిర్వహించారు. వెన్నాచేడ్, కప్లాపూర్, గండేడ్ తదితర గ్రామాల్లో పండుగ సాయన్న చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు.

■ అడ్డాకుల మండలంలోని కందూర్‌లో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాములు సమక్షంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లకు చెందిన డి.నర్సింహకు చెందిన మిద్దె ఇల్లు శుక్రవారం కురిసిన వర్షానికి కూలిపోయిందని.. ఆర్థిక సాయంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ ప్రభాకర్‌కు నర్సింహతోపాటు గ్రామానికి చెందిన యువకులు వినతిపత్రం అందజేశారు. నర్సింహకు తల్లిదండ్రులు, భార్య మృతి చెందారని, కుమారుడితోపాటు తాను మిద్దె ఇంట్లో నివాసం ఉండగా శుక్రవారం సాయంత్రం కురిసిని భారీ వర్షానికి కూలిపోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదయ్య, కృష్ణయ్య, రామాంజనేయులు, శివ, స్వామి, నర్సింహ తదితరులు ఉన్నారు.

సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌కు చెందిన ఈరారం అంజిలయ్య తన ఇంటి నిర్మాణానికి రుణం తీసుకునే విషయంలో గ్రామ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసినట్లు గాధిర్యాల్ కార్యదర్శి హాజీ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటినిర్మాణం చేసుకున్న తర్వాత రుణం తీసుకునేందుకు వెళ్లగా.. అనుమతి ఇవ్వడానికి ఆలస్యమవుతుందని కార్యదర్శి తెలుపగా.. అంతటితో అంజిలయ్య ఆగలేక ట్యాక్స్ రశీదు ఫోర్జరీ చేసి ప్రైవేట్ బ్యాంకులో లోను తీసుకున్నట్లు పోలీసులకు తెలిపారు. అంజిలయ్యపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరాడు.

ధార భాస్కర్‌పై సొంత పార్టీ నేతల ఫిర్యాదు

నవాబుపేట: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ధార భాస్కర్‌పై సొంత పార్టీ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వారిని అప్రదిష్టపాలు చేసేలా సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తున్న నాయకుడిపై చర్య తీసుకోవాలని మండల నాయకులు డిమాండ్ చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మండల ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు. అలాగే ధార భాస్కర్‌కూడా తనపై తప్పుడు ఆరోపణలు చేసిన మార్కెట్ చైర్మన్‌లింగం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్‌తోపాటు పార్టీలో సభ్యత్వం లేని మరికొందరిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం'



స్టేషన్ మహబూబ్‌నగర్: 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నేత ఎన్‌పీ.వెంకటేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీలను మోసం చేసే పార్టీలని ఆరోపించారు. గతంలో హడావిడిగా ఒక్కనెలలోనే 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి పంపినా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్‌పై ఉన్న ప్రేమ బడుగులపై లేదా అని ఆరోపించారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పోరాటం చేస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలందరూ ఏకమై ధర్నాకు వెళ్లామన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుడా ఇల్లు నిర్మించుకోవాలి

రాజాపూర్(బాలానగర్): ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ఇంటి నిర్మాణం చేసుకోవాలని హౌసింగ్ పీడీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం బాలానగర్ మండలంలోని గంగధార్‌పల్లిలో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికంగా సరైన పద్ధతులను అనుసరించి ఇంటి నిర్మాణం చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల్లోనే నాణ్యమైన ఇంటిని నిర్మించుకోవచ్చని లబ్ధిదారులకు సూచించారు. ముఖ్యంగా మేస్త్రీల ఖర్చు తగ్గించుకోవాలన్నారు. ఏఈ దినేశ్, పీఎస్ రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామాధ్యక్షుడికి సన్మానం

చిన్నచింతకుంట: సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు కొకుంట్ల మండలంలోని అప్పంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయ నర్సింహులు హాజరై తిరిగి రావడంతో గ్రామస్తులు, బీసీ నాయకులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, సీతన్న, రాఘవరెడ్డి, రాజారెడ్డి, గోవర్ధన్‌యాదవ్, మదన్‌మోహన్‌రెడ్డి, ఎండీ పాషా, మురళీమోహన్‌రెడ్డి, బోయ చందు, కుర్వశ్రీను, శ్రీనివాసులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గేదె మృతి

మహమ్మదాబాద్: మేతమేసుకుంటూ వెళ్లిన ఓ గేదె ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి మృతిచెందింది. మండలంలోని జూలపల్లికి చెందిన గొల్ల దశరథం శుక్రవారం మధ్యాహ్నం గేదెలను మేతకు వదిలాడు. మేతమేసుకుంటూ వెళ్లి అప్పటికే గాలివానకు తెగిపడి ఉన్న విద్యుత్‌వైరుకు ఓగేదె తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. రూ.80వేల విలువ చేసే గేదె మృతిచెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు.